'మనిషికి...
ప్రేమించడానికి లవరూ
మర్డర్ చేయడానికి శత్రువూ అవసరం
మొదటిది నా భార్య కావడం అదృష్టమైతే
రెండవది నేనే కావడం నా దురదృష్టం'

అందుకే కథ ప్రారంభమైంది
''మూర్తిని చంపేయాలి''
కసిగా ఆరోసారి అనుకున్నాను. వాడి చావుకన్నా తృప్తినిచ్చే సంఘటన నాకేమీలేదు. పద్మలాంటి ఉత్తమ ఇల్లాలిని చంపినవాడు బ్రతికుండడానికి వీల్లేదు.

# హంతకుడు

## -ఇందూర్తి శ్రీకాంత్‌రావు

కేవలం కట్నం కోసం భార్యని రాక్షసంగా చంపుకున్న ఆ నీచుడిని పొడిచి పొడిచి చంపేయాలి.
ఈ రోజు రాత్రే అందుకు మంచి సమయం. ఎందుకంటే ఈ రోజు పద్మ పుట్టినరోజు ఆమె పుట్టినరోజునే ఆమెని చంపినవాడు కూడా చావడం ఆమె ఆత్మకి శాంతినిస్తుంది.

చేతిలోని కత్తివంక ఒకసారి చూసుకున్నానునా కసి తీర్చబోతున్న మారణాయుధం. అయిదున్నర అంగుళాల పొడవులో మృత్యువులా మెరిసిపోతోంది. మధ్యాహ్నం రెండయినట్టు చూపుతోంది వాల్‌క్లాక్. రాత్రి పది దాటాక కాలనీ నిశ్శబ్దమవుతుంది. చాలా మంచి సమయమిది. ఇక ఈ హత్య విషయం బయటపడాలంటే తెల్లవారాలి. ఒకవేళ వాడు నేను పొడిచాక బాధతో అరిచినా ఆ రాత్రి చుట్టుప్రక్కలవారు వచ్చి వైద్య సహాయం అందించేసరికి ప్రాణం పోతుంది. నాక్కావాల్సింది కూడా అదే.

నేను కత్తితో పొడిచాక వాడినే శక్తీ కాపాడలేకపోవడం!

తృప్తిగా కత్తి దిండు కింద ఉంచి కళ్లు మూసుకున్నాను.

ఊహాదృక్కుల ముందు రాక్షసిలాంటి డబ్బు కదలాడింది.

పద్మని మూర్తి చంపడానికి కారణమైన దుష్టశక్తి.

'ఒకప్పుడు నాకన్నా ఎక్కువగా డబ్బుని ప్రేమించాను. కానీ ఇప్పుడు...? దానికన్నా మూర్తిని ద్వేషిస్తున్నాను'

మూర్తి చాలా అదృష్టజాతకుడు.

లేకపోతే పద్మలాంటి అమ్మాయి భార్యగా దొరకదు. అమాయకత, స్వచ్ఛత కలగలిసి ఎదుటివారిని అర్థం చేసుకోగలిగే మంచి సంస్కారి ఆమె. ఆమె దురదృష్టం కూడా ఒక్కటే. డబ్బు కోసం ఏ పనైనా చేసే మూర్తి భార్య కావడం.

వారికి పెళ్లయి సంవత్సరం అయ్యాక ప్రారంభమైంది మూర్తి వేధింపు, డబ్బు తెమ్మని ఆమెని తిట్టి కొట్టి ఇంటికి గెంటేసిన ప్రతిసారీ మధ్య తరగతి తండ్రిని వేధించలేక భర్త చేతిలో ఈ బాధలు పడలేక ఆమె పడే చిత్రహింస అతనికి తెలియదు. పుట్టింటికి వెళ్లేముందు డబ్బు తెమ్మని, వెళ్లి వచ్చాక ఎందుకు తేలేదని ఆమెని హింసించేవాడు. కాదు! నరకం చూపించేవాడు. పెళ్లయిన సంవత్సరం వరకూ గోధుమరంగులో మెరిసిపోయిన ఆమె శరీరం ఆ తర్వాత అతను పెట్టిన శారీరక హింసకి నల్లగా మారింది. ఆమె వర్తమానంలాగే అతను కాల్చిన సిగరెట్లు ఆమె శరీరంపై ఆరిపోయేవి.

అన్ని బాధలను అనుభవించినా తల్లి తండ్రికి భర్త వేధింపులగూర్చి ఒక్క మాట చెప్పలేదు. అగ్నిపర్వతంలా లావాని దాచుకుని దాచుకునీ బాధలను భరించీ భరించీ ఒకరోజు ఫెటీల్మని పగిలి తనని తానే ఆ లావాలో ఆత్మాహుతి చేసుకుంది.

తన మరణానికి తనే కారణమని రాసిపెట్టి కిరోసిన్ పోసుకుని చనిపోయింది. భార్యంటే భరించేదేకాదు క్షమించేదని చెప్పి చివరకు తన చావుకి కూడా భర్తకి రక్షణగా చేసి...

గోరువెచ్చటి తడి చెంపలకు తగిలేసరికి లేచి కూచున్నాను. ఇల్లంతా నా మనసులాగే నిశ్శబ్దంగా నా ఆలోచనల్లాగే భయంకరంగా వుంది. దిండు కింద నుండి కాస్త బైటికొచ్చి కన్పించిన కత్తి నా కర్తవ్యాన్ని కసిని పెంచింది.

వెంటనే లేచి పాంట్ షర్టు వేసుకున్నాను. నా స్నేహితుడు, లాయరు అయిన రాంబాబు దగ్గరకి వెళ్లాలి. ఈ రాత్రి మూర్తిని మర్డర్ చేసేలోగానే చేయాల్సిన పని ఇదొక్కటే.

నేను చేయబోతున్న హత్య మరొకరికి ఉపయోగపడాలి.

అప్పుడే... నా పద్మ ఆత్మ శాంతిస్తుంది.

★★★

''వ్వా...వాట్? నీ అనంతరం నీ ఆస్తి అనాథ శరణాలయానికి చెందేటట్టు వీలునామా రాయాలా?''


నా నిర్ణయానికి రాంబాబు ఆశ్చర్యపోవడంలో వింతేమీలేదు. నా డెసిషన్ వాడిని తప్పక షాక్‌కి గురి చేస్తుందని నాకు తెల్సు. కానీ తప్పదు. అవసరం నాది. ఈ రాత్రి నేను చేయబోయే మర్డర్ కనీసం అనాథ బాలలకైనా ఉపయోగపడాలి.

నిముషం మౌనంగా వుండి ఆ తరువాత సిగరెట్ ముట్టించి అన్నాడు రాంబాబు.

''పట్టుమని ముప్పై ఏళ్లు కూడాలేని నీ ఈ హఠాత్ నిర్ణయానికి కారణం నాకర్థం కావడంలేదు. నిజానికి నీకోసం నీకొక సంబంధం మాట్లాడాను. రేపు నేనే వచ్చి ఆ శుభవార్త చెప్పాలనుకున్నాను''.

విరక్తిగా నవ్వి మధ్యలోనే చెప్పాను.

''వద్దు. మరేమీ చెప్పకు. అమ్మా నాన్న యాక్సిడెంట్‌లో చనిపోయాక ధనపిశాచిగా మారాను. నా భారం తమపై ఎక్కడ పడుతుందోనన్న భయంతో తప్పుకున్న నా బంధువుల ప్రవర్తన నన్ను రాక్షసుడ్ని చేసాయి.



డబ్బు...డబ్బు...డబ్బు అదొక్కడే పొందాలన్న ఆలోచనలో నేనేం పోగొట్టుకుంటున్నానో ఆలోచించలేదు. కానీ...''

ఫోన్ రింగవడంతో చెప్పడం ఆపేసాను. ఫోన్ రిసీవ్ చేసుకున్నాడు రాంబాబు.

నిస్సత్తువగా కుర్చీ వెనక్కి వాలాను. గతం రాక్షసక్రీడ అయి భవిష్యత్తు అంధకారమయితే వర్తమానం తప్పక నరకమవుతుంది. ఒక్కసారిగా నిటారుగా అయ్యాను. నో... ఇప్పుడు నేను బర్స్ట్ అయ్యేలా వున్నాను. కాకూడదు. ఇంకాసేపు ఇలాగే. రాంబాబుతో మాట్లాడితే ఈ రాత్రి నేను చేయబోయే పని గురించి కూడా చెబుతానేమో? ఎట్టి పరిస్థితుల్లోనూ నా నిర్ణయం మారకూడదు. పద్మని చిత్రహింసలు పెట్టి చంపిన మూర్తికి శిక్ష పడి తీరాలి. వాడీ భూమ్మీద ప్రాణాలతో ఉండడానికి వీల్లేదు. ఆవేశంతో పిడికిళ్లు బిగించాను.

రెండో నిముషానికి ఫోన్ పెట్టేసి నావేపు తిరిగాడు రాంబాబు. ''చూడు నేను చెప్పినట్టు వీలునామా రాస్తావా లేదా?'' సూటిగా అడిగాను. ఇప్పుడు నాలో మరో ఆలోచన లేదు.

''నా మాట విను'' లేచి నా భుజంపై చేయి వేయబోయాడు.

ఆ చేయి తోసేసాను. ''నా నిర్ణయం మారదు. నాకివ్వాళే వీలునామా రాయాలి. చెప్పు నువ్వు రాస్తావా? మరో లాయర్ దగ్గరికి వెళ్లమంటావా?''

చిన్నగా నిట్టూర్చాడు రాంబాబు. ''ఒకే ఒకే ఒకసారి నువ్వు తీసుకున్న నిర్ణయాన్ని నేనెప్పుడు మార్చగలిగాను కనుక. ఈ రోజు ఇక్కడే వుండే. రేప్రొద్దునే తీరిగ్గా రాస్తాను''

''ఉండను''

నా గొంతులోని కాఠిన్యానికి ఉలిక్కిపడ్డాడు రాంబాబు. నేనింత కటువుగా వాడితో మాట్లాడ్డం ఇదే తొలిసారి. అయినా సరే స్నేహితుడన్న బంధంతో నేను వీక్ కాదల్చుకోలేదు.

''ఈ రోజు పద్మ పుట్టినరోజు. నా ఇంట్లో తప్ప ఎక్కడా వుండను''

కదిలిపోయాడు రాంబాబు. తప్పనిసరై ''ఒకే కూచో'' అంటూ పేపర్లు బయటకి తీసాడు.

నిముషం తరువాత మాటర్ చెప్పడం ఆరంభించాడు.

ఇంత అర్జంటుగా ఈ వీలునామా అవసరమేమిటో వాడికి తెలియదు. నేనెంత రాక్షసుడ్నో రేపు ఉదయం వాడికి తెలుస్తుంది.

ఫర్వాలేదు. అప్పటిలోగా నా పగ తీరిపోతుంది.

నిజం!

ప్రేమలాగే పగ కూడా బలమైంది.

శత్రువు మృత్యువుతో రమించేవరకూ ఆ వేడి చల్లారదు.

ఇప్పుడు నాలో రగులుతున్న వేడి అదే!

★★★

''వద్దు నన్ను చంపొద్దు. మీకు దండం పెడ్తాను'' నిస్సహాయంగా అరిచిందామె.

ఆమె ఆర్తనాదాలు పట్టించుకోలేదతను. పక్కనే వున్న కిరోసిన్ టిన్ అందుకుని ఆమెపై గుమ్మరించాడు. ఒక్కసారిగా వికృతమైన వాసన ఆవరించింది.

ఖంగారుగా కదలబోయిందామె. కాళ్లూ చేతులు బంధించి వుండడంతో కదలలేకపోయింది. ఆమె ప్రయత్నం చూసి నిర్దయగా నవ్వాడతను.

''నాకు డబ్బు కావాలే. డబ్బు తెమ్మని పుట్టింటికి పంపిన ప్రతిసారీ ఏదో కథ వినిపిస్తూ వస్తున్నావు. సిగరెట్లతో వాతలు పెట్టినా బెల్ట్‌తో బాదినా నీకు బుద్ధిరాలేదు. మొగుడికోసం పుట్టింటి నుండి డబ్బు కూడా తేలేని నువ్వు నాకక్కర్లేదు. నువ్వు చావాలి. చచ్చి బూడిదైపోవాలి. పో... చచ్చిపో'' జేబులోనుంచి అగ్గిపెట్టె తీసాడతను.

''వద్దు... చంపొద్దు... ఏమండీ ప్లీజ్ నన్ను

చంపకండి''

ఛరాలున వెలిగిన అగ్గిపుల్ల గింగిరాలు తిరుగుతూ ఆమె వంటిని తాకింది. అసలే కిరోసిన్‌తో తడిసిన ఆమె శరీరం భగ్గున మండింది. ఒక్కసారిగా పెద్ద జ్వాలలు ఆమెను ఆవరించాయి. మంటల్లో నుండే ఆమె కేకలు బిగ్గరగా వినవచ్చాయి. ''నన్ను కాపాడండి... ఏమండీ...''

చివాలున లేచి కూర్చున్నాను. ఒళ్లంతా వెచ్చటి ఆవిరి కళ్లముందు ఇంకా మండల్లో మండుతున్న ఆమె గోచరిస్తోంది. ఆమె ఎవరో కాదు. పద్మ... అతను మూర్తి..: శరీరమంతా చెమటతో తడిసిపోయింది.

తల తిప్పి వాచ్ కేసి చూసను. రాత్రి ఎనిమిది ముప్పై దాటింది. మంచంపై నుండి లేచి బయటకి వచ్చాను. చలికాలం అవడంతో వీధిలో జనం పెద్దగా తిరగడంలేదు. ఇంకాసేపైతే ఈ మాత్రం కూడా ఉండరు. చలిలాగే బాధించే చీకటి రాక్షసుడు సగం ప్రపంచాన్ని శాసిస్తున్నాడు. చలికి తట్టుకోలేక కాబోలు పక్క వీధిలో నుండి ఓ కుక్క మోర ఎత్తి అరుస్తోంది.

మెల్లగా మంచంపై వాలాను. పగో, పశ్చాత్తాపమో గుండెల్లో దాగలేక కళ్లనుండి బయటకి వచ్చేసింది. నా జీవితంలో మొట్టమొదటిసారిగా పెద్దగా ఏడ్చాను. ఆగలేక, ఆపుకోలేక వెక్కి వెక్కి... ఫర్వాలేదు. ఆ బాధ నా పగ తీర్చుకోవడంలో మరీ ప్రోత్సాహకారి అవుతుంది.

సరిగ్గా రాత్రి పదకొండు గంటలకు లేచాను.

స్మశానంలాంటి నిశ్శబ్దంలో వుంది వీధంతా.

పద్మ అనే దేవతని వేధించి, హింసించి చంపేసిన రాక్షసుడికి ఆఖరి నిముషాలవి.

★★★

భయంకరమైన నిశ్శబ్దాన్ని కౌగిలిలోకి తీసుకున్నట్టుగా వుంది వాతావరణం. నా ఒళ్లంతా టెన్షన్ ఆవరించి వుంది. చలికాలమైనా నుదుటిపై చెమట చోటు చేసుకుంది.

దిండు పక్కకు జరిపి కిందనున్న కత్తిని బయటకి తీసాను. ట్యూబ్‌లైట్ కాంతిలో మెరుస్తూ నాలాగే శత్రువు అంతం కోసం ఎదురు చూస్తున్నట్టుంది. నన్ను కాల్చేస్తున్న గతంలాగే మృత్యువులా ఆవరించిన చిక్కని చీకటి కనబడుతోంది. కత్తిని పిడికిట్లో ఇముడ్చుకుని పక్కకు జరిగాను.

గడియారపు టిక్ టిక్‌మన్న శబ్దం ఢంకా దెబ్బల్లా వినబడుతున్నాయి.

మంచంలో వున్నాడు మూర్తి. దేవతలాంటి ఓ ఇల్లాలిని కట్నంకోసం దారుణంగా చంపిన నీచుడు. కళ్లముందు అమాయకంగా నవ్వుతున్న పద్మ కదలాడింది. గుండె పుష్పాన్నెవరో ఇనుప పిడికిట్లో బిగించి పిండేస్తున్నంత బాధ, పగ, ఆవేదనల సమ్మిళితమైన భాష్పాలు. మనసు కోట నుండి, కళ్ల గవాక్షం గుండా బయటకి ప్రవహించాయి.

ఆవేదం, పశ్చాత్తాపం, ఉన్మత్తత, ఉద్రేకం, పగ...

కత్తినా పిడికిలిలో బిగుసుకుపోయింది. కళ్లముందు మూర్తి అంటించిన మంటల్లో పద్మ మాడిపోతూ రాలిపోతూ... నన్ను కాల్చేస్తూ చేతిలోని కత్తి చివాలున గాల్లోకి పైకి లేచింది.

సర్...ర్‌మని చర్మాన్ని చీల్చుకుని మరీ దిగబడింది.

''హు...ప్...'' మూటలా ఎగిరిపడ్డాడు మూర్తి నా సంతోషంలాగే. ఒక్కసారిగా రక్తం ఎగజిమ్మింది. ఎర్రగా కాలుతున్న లావాటి ఊచ కడుపులో దిగబడినట్టు కొట్టుకుంటున్నాడు.

జాలనిపించలేదు. టేబుల్‌పైనున్న పద్మ ఫోటోకేసి చూసాను. భరించలేని బాధకి, కరగబోతున్న గుండె మళ్లీ పాషాణమైంది. పిడికిలి ఇంకా బిగబట్టి మూర్తి కడుపులోని కత్తిని గుండ్రంగా తిప్పి చివాలున బయటకు లాగాను.

''అమ్...మ్మా'' బలహీనమైన మూర్తి కేక నా చెవులనీ, పద్మ ఫోటోని అమృతంలా తాకింది. మంచంనిండా తెల్లని పరుపుపై ధారలా, నిశ్శబ్దంగా పారుకుపోతోంది రక్తం.

ప్రేగులన్నిటినీ ఎవరో తోడేస్తున్నట్టు కడుపుని పట్టుకుని పొర్లకింతలు పెడుతున్నాడు మూర్తి.

మాట పడిపోయింది. ప్రాణమే ఇంకా పోలేదు. అయినా పద్మ మంటల్లో మాడి బూడిదైన బాధకన్నా ఇది తక్కువే.

మూర్తిని మెల్లగా లేపాను. కడుపు వాంతి చేసుకున్నట్లు పేగులూ, రక్తం జారిపడుతున్నాయి. మెత్తని పరుపుపై మెత్తని పేగులు. మృత్యువు తలచుకుంటున్నట్లు సన్నని శబ్దంతో వెక్కిళ్లు కూడా పెడ్తున్నాడు బాధతో కనుగుడ్లు పొడుచుకువచ్చాయి. రెండు చేతులూ పొడిచినచోట కడుపుకయిన రంధ్రం దగ్గరే పెట్టుకున... పట్టుకునీ...

బలవంతాన ఒక చేయి తీసి మరోసారి గాల్లోకి లేపాను. వణుకుతూ వచ్చిన నా చేతిలోని కత్తి మళ్లీ కడుపులో దిగబడింది.

''ఓ...ప్...ప్'' మళ్ల చర్మం చెరగీ చిరిగీ, కళ్లల్లోనుండి వెచ్చటి ఆవిరులు. గుండెల్లో నుండి పగ, సంతృప్తిల చల్లని భావనలు. శిక్ష సబబేనంటున్నట్టు రెండు కొండల నడుమ వున్న గౌరై నన్నే చూస్తోంది.

ఉన్నట్టుండి మూటలా ముందుకు పడ్డాడు మూర్తి.

చేతిలోని కత్తి కస్సుమని లోపలికి దిగింది. అంతకుముందు పోటుకి అయిన రంధ్రం నుండి నా చేయికూడా కడుపులోకి వెళ్లింది. పద్మ వేదనల్నీ, చిత్రహింసల్నీ కడుపులో దాచుకున్న మూర్తి కడుపులో కొన ప్రాణంతోబాటే కత్తి కూడా దాగింది.

మూర్తి ఇంకా చావలేదు. తెగిన పాము తోకలాగా కాళ్లూ చేతులు కదులుతున్నాయి. కళ్లు మూసుకుపోతున్నాయి. పద్మ రక్తం కళ్లచూసీ చూసీ అలవాటయిందేమో చివరకు తన రక్తంలోనే పడి కొట్టుకుంటున్నాడు. చావబోతున్నాడు.

చావో, చంపడమో అన్నది తెలీదు.

దూరం నుండి అనాథబాలల చేతులూపుతూ వద్దు వద్దన్న దృశ్యం. కళ్లకి సన్నని మసక. పలుచని నీటి పొరలా... కళ్లముందు పద్మ ఫోటో.

ఆ తర్వాత...

ఊహూ! ఇంకేమీలేదు.

ధన రాక్షసుడి నుండీ... పశ్చాత్తాపం నుండి... ఆత్మాహుతి వరకూ...

చాలు! కొందరి జీవితాలింతే.

ఎందుకు పుడ్తారో, ఎందుకు చస్తారో వారికే తెలియదు. పుడతారు. కనీసం... జ్ఞాపకాలు కూడా మిగల్చకుండా చచ్చిపోతారు.

అందుకే వారికి చరిత్రేమీ వుండదు.

చరిత్రలో మంచివాళ్లు, చెడ్డవాళ్లు వుంటారు. కానీ సగం చెడ్డా, సగం మంచివాళ్లుండరు. అందుకే వీరి బ్రతుకులు చరిత్ర పుస్తకాలు తినే పురుగుకన్నా హీనం.

ఇంకేమీ చెప్పలేకపోతున్నారు.

రాక కాదు.

చెప్పడానికి సరిపోయేంత ప్రాణం లేక.

ఎందుకంటే...

'ఆ చచ్చిపోతున్న మూర్తిని నేనే కనుక...



## తల్లి అందం!

సాగరకన్య శిల్పాశెట్టి కన్నా ఆమె తల్లి హడావుడి ఎక్కువైపోయింది షూటింగ్ స్పాట్‌లో.. 'షాట్ రెడీ' అని దర్శకుడు పిలవగానే మేకప్ కిట్ తెరిచి మెరుగులు దిద్దుకుంటూందట శిల్పా తల్లి. ఇంతకీ షాటుకు రెడీ అయ్యింది కూతురో, తల్లో తెలియక తికమక పడిపోతున్నారుట యూనిట్ సభ్యులు! ఈ విషయంలో మాత్రం తల్లిని వారిస్తూ మందలిస్తోందట శిల్ప. నీ షాటు నీది, నా షాటు నాది... అంటే ఏం చెయ్యగలం చెప్పండి!

-కృష్ణజీ

